కథ

# సమాధానం లేని ప్రశ్న

నామని సుజనాదేవి
77993 05575

అదోక

కుల సంఘంలోని విశాలమైన హాలు. రెండు వైపులా వేసిన కుర్చీలలో పెద్దలందరూ ఆసీనులై ఉన్నారు. వారికి ఎదురుగా ఎడమవైపు ఉన్న కుర్చీలలో అమ్మాయి వైదేహి, ఆమె తరపు బంధువులు.. కుడివైపు అబ్బాయి మోహన్, అతని బంధువులు కూర్చుని ఉన్నారు.  కలియుగంలో ఇంతవరకెన్నడూ కనీవినీ ఎరగని ఒక కొత్త ఘట్టానికి అక్కడ తెరలేవబోతున్నదని ఆ క్షణంలో అక్కడున్న ఎవ్వరికీ తెలియదు.

ఆ దంపతులు ఏదో కూలీనాలీ చేసుకునే దిగువ తరగతి జంట కాదు. ఇద్దరూ పీహెచ్‌డీ చేసి.. డాక్టరేట్ పట్టా పుచ్చుకున్న విద్యావంతులు. పెద్ద మనిషి లేచి..

''అందరికీ నమస్కారం. ఇప్పటికే ఇద్దరు పిల్లలున్న ఈ దంపతుల సమస్యను ఎలాంటి పక్షపాతం లేకుండా, మనస్ఫూర్తిగా, న్యాయబద్ధంగా,  ధర్మబద్ధంగా పంచాయితీలో న్యాయం చేస్తామని ఆ భగవంతుడి సాక్షిగా మేమందరం హామీ ఇస్తున్నాం. మోహన్.. ముందుగా మీరు చెప్పండి!''.

''అభియోగం నాపైనే.. వైదేహి నుంచి వచ్చింది కాబట్టి ముందు ఆమెనే మాట్లాడమనండి'' అన్నాడు మోహన్.

అతని సంస్కారానికి అందరికీ అతనిపై గౌరవభావం కలిగింది.

వైదేహి చెప్పడం మొదలుపెట్టింది.

''మేమిద్దరం ఇరువైపులా ఉన్న పెద్దవాళ్ల అంగీకారం మీదనే.. కాళ్ల దగ్గరికి వచ్చిన ఎన్నో మంచి సంబంధాలను కాలదన్ని.. ప్రేమించి పెళ్లి చేసుకున్నాం. పెళ్లిరోజే ఊరేగింపులో వైభవంగా సాగనంపాలని ప్లాన్ వేసుకున్న మా తమ్ముణ్ని తిడుతూ.. నాతో..

'ఇక్కణ్నుంచి పావుగంటలో వెళ్లిపోవాలి. నువ్వేం చేస్తావో నాకు తెలియదు' అంటూ వార్నింగ్‌తో మొదలుపెట్టాడు. ఇక తర్వాత ప్రతీ చిన్న పనిలోనూ తప్పులు తీయడమే!''.

''అంటే.. మిమ్మల్ని తిట్టేవాడా? కొట్టేవాడా?'' పెద్దమనిషి ప్రశ్నించాడు.

''ఆయన చేసే టార్చర్ అంతకు మించింది. ఈయన చూపించిన నరకం అనేది పూర్తిగా చెప్పడానికి రాదు. అవి మనసును ముక్కలు చేసి ఎన్ని గాయాలు చేస్తుందో అనుభవించిన వారికే తెలుసు. పెళ్లయిన వారంలో మా అత్తగారింటి పక్కనే ఉన్న చిన్నత్తకు పెళ్లిలో తెచ్చిన బిందెను ఇవ్వడానికి వెళ్లా. వారు బలవంతంగా భోజనానికి కూర్చోబెట్టారు. వచ్చి ఆలస్యం అందుకే అయ్యిందని చెప్పాను. అంతే!

'వారికీ మాకూ పడదంటే మా అనుమతి లేకుండా అక్కడ భోజనం ఎలా చేస్తావు?' అంటూ సునామీలా విరుచుకుపడ్డారు అత్తా, మామ, భర్తా! ఏడుస్తున్న నన్ను, మరిది ఎదుటే ముక్కు నేలకు రాయించి, మరోసారి ఇలాంటి తప్పు చేయనని చెంపలు వేసుకునేంత వరకూ వదల్లేదు. ముల్లులా గుచ్చుకుంటూ తీరని వేదనకు గురిచేస్తున్న బాధతోనే ఉద్యోగం చేస్తున్న హైదరాబాద్‌కి ఆయనతో వెళ్లిపోయాను.

లోకమంతా మంచివాడన్నా, నిజంగా.. మంచివాడా!? కాదా!? అన్నది భార్యను అడిగితేనే తెలుస్తుందని.. అందుకే అన్నారు. మహాసముద్రాన్ని మరచెంబులో పట్టలేనట్లు ఎలా చెప్పగలను? కష్టపడి సంపాదించిన పీహెచ్‌డీ పనిమీద, ప్రొఫెసర్ దగ్గరికి వెళ్లినప్పుడు ఆలస్యమైతే..

'ఇప్పటిదాకా ఎవరితో కులుకుతున్నావే? ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయవు. ఎవడి..' జీవితంలో ఎన్నడూ వినని అసభ్యకరమైన, పలకడానికి జుగుప్స కలిగించే అసహ్యకరమైన పదాలు విన్న నా మెదడు పూర్తిగా మొద్దుబారిపోయింది!''..

''చిత్రహింసలు పెడుతున్నాడని పెళ్లయిన పదమూడేళ్లకు చెబుతున్నారు. మరి ఇంతకాలం ఎందుకు బయటపెట్టలేదు?''..

పెద్దమనిషి మధ్యలో అడుగుతుంటే..

''అలా అడగండి! అన్నీ అబద్ధాలు, అందుకే..'' అనబోతున్న మోహన్‌ని పెద్దమనుషులు వారించారు.

''దానికీ కారణం ఉంది. ఎందుకంటే మాకు పెళ్లయిన తొలిరాత్రి ఆయన నాతో ఒకమాట చెప్పారు.

అదేమిటంటే..

'మనిద్దరి మధ్యన ఎటువంటి గొడవలు జరిగినా.. వాటికి సంబంధించింది ఏదైనా నువ్వు నాతోనే మాట్లాడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడో వ్యక్తి దగ్గరికి వెళ్లకూడదు. పొరపాటున మూడో వ్యక్తి దగ్గరికి విషయం వెళ్లిందని తెలిస్తే మాత్రం.. ఇక ఆ తర్వాత నేను నీతో ఏమాత్రం కలిసి ఉండను. ఒకవేళ నేను కోపంలో ఏమైనా అన్నా.. నువ్వు ప్రేమతో నన్ను మలుచుకో! అంతేకానీ, ఎవరికైనా తెలిస్తే మాత్రం విడాకులే!' అన్నారు. దాంతో ఎన్నోసార్లు కోపంతో అరిచి, చేతిలోనివి ఎత్తేసి, అలిగి మాట్లాడకుండా ఉన్నా! తప్పు ఆయనదే అయినా.. నేనే సర్దుకుని ఏదో రకంగా ప్రసన్నం చేసుకునే దాన్ని. ఇంకా ముఖ్యమైన ఘోరమైన విషయం ఒకటి చెప్పాలి. అది మా బాబు పుట్టినప్పటిది..''

* * *

వంశాంకురం పుట్టాడని మా అత్తామామ అందరికీ స్వీట్స్ పంచుతుంటే.. అమ్మానాన్న సంతోషపడ్డారు. కానీ, పచ్చి బాలింతనని కూడా చూడకుండా ఈయన నాకు ప్రత్యక్ష నరకం చూపించాడు.

''నేనేమీ అనను.. ఒక్క విషయంలో నిజం చెప్పు. వీడు నిజంగా నాకు పుట్టిన వాడేనా? నీకు మా నాన్నకు పుట్టిన వాడా?'' అన్నాడు.

నాకు గుండెల్లో అగ్నిపర్వతాలు పేలడమంటే, కన్నీరు కాల్వలు కట్టడమంటే ఏమిటో తెలిసిందప్పుడే. కళ్లు బైర్లు కమ్మాయి. ఒకవైపు విపరీతంగా బ్లీడింగ్. డెలివరీ అయి రెండు గంటలు కూడా కాలేదు.

